రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

జవహర్‌నగర్: రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్ ఓ ప్రకటన ద్వారా తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ.. తెలంగాణ రాష్ట్ర రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు పిలుపు మేరకు శుక్రవారం జిల్లాలోని రేషన్‌డీలర్లు సంపూర్ణంగా బంద్ పాటించాలని కోరారు. కేంద్రప్రభుత్వం రేషన్ డీలర్లకు ఐదు నెలలుగా కమిషన్ చెల్లించడంలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ మేనిఫెస్టో ప్రకారం రూ.5 వేల గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

బీజేఎంఎస్ జాతీయ కార్యదర్శిగా సంతోష్


సంతోష్‌తో జాతీయ అధ్యక్షుడు జాటవ్

మేడ్చల్: భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ (బీజేఎంఎస్) జాతీయ కార్యదర్శిగా మేడ్చల్ పట్టణానికి చెందిన వేలూరి సంతోష్ నియమితులయ్యారు. బీజేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు శాంత్ ప్రకాశ్‌జాటవ్ సంతోష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేఎంఎస్‌ను బలోపేతం చేస్తునే అసంఘటిత కార్మికుల శ్రేయస్సుకు పనిచేస్తానన్నారు. కార్మికుల తరపున పోరాటం నిరంతరం కొనసాగిస్తానన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

శామీర్‌పేట్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ.. లక్ష్యాన్ని చేరుకోవాలని శామీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపాలిటీలోని జగ్గంగూడ జీనియస్ గ్రామర్‌స్కూల్‌లో నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ జోనల్‌స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. గత మూడ్రోజులుగా నిర్వహించిన శామీర్‌పేట్ జోనల్ స్థాయి క్రీడా పోటీలైన వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలను ఎస్‌జిఎఫ్ జోనల్ క్రీడల కార్యదర్శి సత్తిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలైన జట్లకు శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎంఈఓ కమలాకర్, ఎస్సై సోమిరెడ్డి, ఉద్దెమర్రి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం. ప్రభాకర్‌లు బహుమతులను ప్రదానం చేశారు.

చిట్టీల పేరుతో మోసం

సుమారు రూ.3 కోట్లతో పరారైన మహిళ

జవహర్‌నగర్: అమాయక ప్రజలను మోసం చేసి చిట్టీల పేరుతో ఓ మహిళ పరారైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ శాంతినగర్‌లో నివసించే మమత అలియాజ్ స్వప్న, గత 14 ఏళ్లుగా స్థానికంగా ఉంటూ.. చిట్టీల వ్యాపారం చేస్తుంది. చిట్టీలు ఎత్తుకున్న వారు ఆమెను డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేశారు. దాదాపు 200 మంది వద్ద సుమారు రూ.3 కోట్ల మేర డబ్బులు తీసుకుని పరారైందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై జవహర్‌నగర్ పోలీసులను వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న స్కూల్ ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, అధ్యాపక బృందం

కీసర: రాంపల్లి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులను రేపటి పౌరులుగా తీర్చిదిద్దటంలో గురువుల కృషి ఎనలేనిదన్నారు. వారి భవిష్యత్తుకు బాటలు వేసేది గురువులేనన్నారు. వారు అంకితభావంతో పనిచేసినప్పుడే విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులకు పలు క్రీడాపోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం కె.సుశీల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఔషధ విక్రయాలు

అల్వాల్: ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు ఔషధ విక్రయాలు చేయాలని మల్కాజిగిరి డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ అన్నారు. గురువారం అల్వాల్‌లో మెడికల్ కెమిస్ట్రీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మెడికల్‌షాప్ యాజమానులకు ప్రభుత్వ నిబంధనలు, పాలసీపై అవగాహన కల్పించారు. తయారీదారులు, డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు చేసే పొరపాట్లు రిటైలర్లు బాధ్యులు కాకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. ప్రిస్క్రిప్షన్లు, బ్యాచ్ నెంబర్లు లేకుండా ఎవరూ..? మందులు అమ్మకూడదన్నారు.

ఆక్రమణలపై చర్యలేవి ?

హైడ్రా బోర్డు పెట్టినా.. మారని పరిస్థితి
- కనుమరుగవుతున్న ప్రజా ప్రయోజన స్థలం
- సుమారు రూ.8 కోట్ల విలువైన భూమి
- బై-నంబర్లతో ప్లాట్లుగా విభజించి విక్రయం


పార్కు పరిస్థితి

పోచారం: అధికారుల చేతులు తడుపుతూ కొందరు కబ్జాదారులు ప్రజా ప్రయోజన స్థలాలను కబ్జా చేస్తున్నారు. పార్కులు, కమ్యూనిటీహాల్ స్థలాలను ప్లాట్లుగా విభజించి బై-నంబర్లతో విక్రయిస్తున్నారు.

◆ పోచారం మున్సిపాలిటీ పరిధి, కొర్రెముల్‌లోని లక్ష్మీనగర్ లే అవుట్‌లో ప్రజాప్రయోజనాల కోసం కేటాయించిన 1542 చదరపు గజాల స్థలం ఇదే కోవకు చేరింది. ఈ 1542 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమిస్తున్నారని కాలనీవాసులు ఈసారి జనవరిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన ఖాళీ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

పార్కుగా అభివృద్ధి చేసిన పురపాలక సంఘం...

కాలనీవాసులు వినియోగించుకునేలా పోచారం పురపాలక సంఘం ఈ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేసింది. సుమారు 300 మొక్కలు నాటి, చుట్టూ ఫెన్సింగ్, నీటి వసతి కోసం బోరు మోటర్, కూర్చునేందుకు వీలుగా సిమెంట్ సోఫాలు ఏర్పాటు చేశారు. ఇంతగా అభివృద్ధి చేసిన పార్కునే కాపాడుకోలేని పరిస్థితి ఏర్పడింది.

బై-నంబర్లతో ప్లాట్లుగా విభజన..

కొర్రెముల్‌లోని సర్వే నెంబర్లు 747, 750లో 10.12 ఎకరాల విస్తీర్ణంలో లక్ష్మీనగర్ పేరుతో లేఅవుట్ చేశారు. ఈ లేఅవుట్‌లోని ప్లాట్ నెంబర్లు 4, 5 మధ్యలో 1542 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేశారు. కానీ, ఇదే స్థలాన్ని ప్లాట్లుగా విభజించి, ఆ ప్లాట్లకు 5/ఎ, 4/ఎ, 4/బి, 4/సి నెంబర్లు ఇస్తూ.. మరో నకిలీ లేఅవుట్ తయారు చేశారు. బై నంబర్ల ప్లాట్లను సామాన్య ప్రజలకు విక్రయించారు.

ఫిర్యాదు చేసిన ప్రయోజనం శూన్యం..

అనుమతులు, ఆక్రమణలు, విద్యుత్ కనెక్షన్లపై కాలనీవాసులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. సుమారు రూ. 8 కోట్ల విలువైన భూమి క్రమంగా విక్రయదారుల చేతుల్లోకి పోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కును పరిరక్షించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

క్రమంగా కనుమరుగవుతున్న పార్కు..

బైనంబర్లతో ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులు క్రమంగా ఆక్రమించుకోవడంతో పార్కు కనుమరుగవుతోంది. దీంతో పార్కు అభివృద్ధికి పోచారం పురపాలక సంఘం వెచ్చించిన నిధులు నిరుపయోగమవుతున్నాయి.

◆ ఇప్పటికే సుమారు 80 శాతం పార్కును కొనుగోలుదారులు ఆక్రమించుకుని ప్రహరీలు నిర్మించుకున్నారు. ఒక చోట గదిని నిర్మించి, విద్యుత్ కనెక్షన్ కూడా తీసుకున్నారు.

హెచ్‌ఎండీఏ అనుమతులు..

వివాదాస్పదంగా మారిన స్థలంలోని ఓ ప్లాటు కొనుగోలుదారుడికి హెచ్‌ఎండీఏ అధికారులు జీ+3 అంతస్తులతో భవన నిర్మాణ అనుమతిని జారీ చేశారు. క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించకుండానే అధికారులు అనుమతులు జారీ చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పార్కుకు పక్కనే ఉన్న ఖాళీ జాగాను చూపించి కరెంట్ కనెక్షన్ తీసుకున్నారని కాలనీ ప్రతినిధులతో విద్యుత్‌శాఖ సిబ్బంది చెప్పారు.

తగిన చర్యలు తీసుకుంటాం...



నిబంధనలు అతిక్రమించి ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవు. పోచారం మున్సిపాలిటీ కమిషనర్‌గా ఇటీవలే బాధ్యతలు తీసుకోవడంతో ఈ సమస్య నా దృష్టికి రాలేదు. అయినప్పటికీ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– నిత్యానంద్, కమిషనర్ పోచారం

బోర్డును ఏర్పాటు చేశాం..

కాలనీవాసులు ఈ ఏడాది జనవరిలో హైడ్రాను సంప్రదించి ఖాళీ స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. సకాలంలోనే స్పందించి స్థలాన్ని గుర్తించాం. లక్ష్మీనగర్‌లోని ఖాళీ స్థలాన్ని పార్కుగా పేర్కొంటూ బోర్డును ఏర్పాటు చేశాం.

– సైదులు, ఇన్‌స్పెక్టర్, హైడ్రా పీఎస్

బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల ధర్నా


డిపో ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

మేడ్చల్: కళాశాలల సమయాల్లో బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ.. ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మేడ్చల్ బస్‌డిపో ఎదుట విద్యార్థులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ నాయకులు మాట్లాడుతూ.. గ్రామాల నుంచి మేడ్చల్‌లో ఉన్న వివిధ కళాశాలలకు కళాశాల సమయాల్లో బస్సులు నడవకపోవడంతో విద్యార్థులు చదువుల్లో నష్టపోతున్నారన్నారు. ఉదయం కళాశాలల సమయాల్లో సాయంత్రం ఇంటికెళ్లే సమయాల్లో బస్సులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ అధికారులు విద్యార్థుల సమయాల్లో బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. ఉదయం పూట బస్సులు ఆలస్యంగా రావడం వల్ల క్లాసులకు గైర్హాజరు కావాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం బస్సులు లేకపోవడంతో గ్రామాలకు నడిచి వెళ్తున్నారని వాపోయారు. మేడ్చల్ డిపో మేనేజర్ విద్యార్థులతో మాట్లాడి పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శులు కార్తీక్, ప్రశాంత్, నాయకులు భగత్, శ్యామ్, కరుణాకర్, ఆకాశ్, బాల కిరణ్, సుధీర్, రాము, రాజు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి

శామీర్‌పేట్: మూడుచింతలపల్లిలోని బీటీ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఎంపీ ఈటల రాజేందర్‌కు బీజేపీ నేత నరేందర్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పోతారం నుంచి అనంతారం రోడ్డు మీదుగా వివిధ గ్రామాలకు వెళ్లేందుకు ఈ రోడ్డే ప్రధానమైందని, ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పోతారం రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని ఎంపీ ఈటలను కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, కార్యవర్గసభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రవీందర్‌రెడ్డి, సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి, రత్నాల రవి, మచ్చేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

‘స్వయం స్వచ్ఛ’ కార్మికుల వివరాల సేకరణ


వివరాలు తెలుసుకుంటున్న స్పెషల్ ఆఫీసర్ పుష్పలత, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి

కీసర: వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని ఆర్‌జీకే కాలనీలో గురువారం స్పెషల్ ఆఫీసర్ పుష్పలత, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డిల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్‌జీకే కాలనీలో ‘స్వయం స్వచ్ఛ’ (చెత్తేరుకునే) కార్మికుల పూర్తి వివరాలు సేకరించారు. వారి వ్యక్తిగత వివరాలు, కుటుంబసభ్యుల సంఖ్య, విద్య, ఆరోగ్యం, భద్రత, సాధారణ వ్యాధులు, గాయాలు, వైద్య సౌకర్యాలు, రక్షణ, ఆదాయం, జీవనోపాధి, పొదుపు, అప్పులు, ప్రభుత్వ పథకాలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో తడి, పొడి వ్యర్థాలు వేరు చేయడం, సీజనల్ వ్యాధులు, కంపోస్టింగ్‌పై అవగాహన, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. డీఈఈ బాలమురళి, మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, వార్డు ఆఫీసర్లు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్ల పంపిణీ


పారిశుద్ధ్య కార్మికులతో అదనపు కలెక్టర్


నిమజ్జన ఏర్పాట్లను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా గురువారం రెయిన్‌కోట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షంలో పారిశుద్ధ్య కార్మికులకు ఇబ్బంది కలగకుండా రెయిన్ కోట్లను అందజేసినట్లు ఆమె పేర్కొన్నారు. తహసీల్దార్ రజిని, మున్సిపల్ కమిషనర్ రాజేష్, ఏఈ రాకేష్, మేనేజర్ సతీష్, ఆర్‌ఐ సాయిరాం, కావ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, రాజీవ్ పాల్గొన్నారు.

వినాయక సాగర్ పరిశీలన..

ఘట్‌కేసర్: ఏదులాబాద్ వినాయకసాగర్ (శ్రీ లక్ష్మీ నారాయణ చెరువు)ను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, తహసీల్దార్ రజిని, మున్సిపల్ కమిషనర్ రాజేష్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. నాయబ్ తహసీల్దార్ రాజేందర్, ఎస్సై శేఖర్, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


మహాలక్ష్మి

ఘట్‌కేసర్: ఓ మహిళ అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ లింగస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, రాజమండ్రి నిడదవోలు గ్రామానికి చెందిన కనుమూరి మహాలక్ష్మి (43) 3 నెలల క్రితం ఓ మ్యారేజ్ బ్యూరో ద్వారా ఘట్‌కేసర్ పట్టణానికి చెందిన కడమంచి యాదగిరిని రెండో వివాహం చేసుకుంది. అప్పటి నుంచి ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో భర్తతో కలిసి ఉంటోంది. కాగా మేడిపల్లిలోనిఓ రోల్డ్ గోల్డ్ కంపెనీలో పనిచేస్తున్నానని చెబుతూ.. 15 రోజులుగా ఇంటి నుంచి వెళ్తుంది. సోమవారం ఉదయం పనికోసం వెళ్లిన ఆమె సాయంత్రం 5 గంటలకు ఇంటికి వస్తున్నట్లు ఫోన్‌లో మాట్లాడింది. కానీ రాత్రైనా తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో భర్త తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె పనిచేస్తున్న చోట ఆరా తీయగా.. ఉద్యోగం చేయడం లేదని తేలింది. భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుడికి పూజలు


రాఘవేంద్రనగర్ మండపం వద్ద కళాకారులతో ఏసీపీ శంకర్‌రెడ్డి


జవహర్‌నగర్‌లో కాంగ్రెస్ నేత శ్రీకాంత్‌యాదవ్

మేడ్చల్: ఎల్లంపేట్, మేడ్చల్ మున్సిపాలిటీలలో గణపతి నవరాత్రి ఉత్సవాలు జోరుగా సాగుతున్నాయి. నిమజ్జన తేదీలు దగ్గరపడటంతో కాలనీలు, గ్రామాలు, అపార్ట్‌మెంట్లలో ఏర్పాటు చేసిన వినాయకవిగ్రహాల వద్ద జోరుగా ప్రతిరోజు సాయంత్రం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కుంకుమార్చనలు, హోమాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నారు.

◆ రాఘవేంద్రనగర్ మండపం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా.. మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి పాల్గొని కళాకారులను అభినందించారు. అద్భుత వేలం ఆటపాటలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధిలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నిమజ్జనానికి వినాయక విగ్రహాలను డప్పుచప్పుళ్లు, ఆటపాటలతో తీసుకెళ్తున్నారు. పలు మండపాల వద్ద కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు.

నియామకం


నియామకపత్రాన్ని అందజేస్తున్న రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం సమతానగర్‌కు చెందిన ఉప్పు విజయ్‌కుమార్ పటేల్ తెలంగాణ రాష్ట్ర బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య నియామక ఉత్తర్వులు జారీ చేశారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో నియమించిన ఆర్. కృష్ణయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్, బీసీ యువజన సంఘం రాజ్‌కుమార్ సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు..

ఆకట్టుకున్న జిల్లాస్థాయి ‘కళా ఉత్సవం’


కళా ఉత్సవ్ విజేతలతో జిల్లా విద్యాధికారి విజయకుమారి

ఘట్‌కేసర్: సమగ్ర శిక్ష మేడ్చల్ జిల్లా స్థాయి కళా ఉత్సవం ఏదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాధికారి విజయకుమారి సమక్షంలో 74 పాఠశాలల నుంచి 132 మంది విద్యార్థులు 12 అంశాల్లో పోటీ పడ్డారు. మొదటి, రెండో స్థానం సాధించిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. మండల విద్యాధికారి శ్రీధర్, ప్రిన్సిపాల్ రాము, జీసీడీఓ హేమలత, పద్మజ, జ్యూరీ సభ్యులు చైతన్య, కిషన్, ధర్మపాల్, వాసవీచౌదరి, రమ్యవేణి, సంతోష్‌కుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కీసర ప్రభుత్వ పాఠశాల సందర్శన

కీసర: కీసర ప్రభుత్వ పాఠశాలను దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్‌లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు వంగేటి రాంరెడ్డి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నియమాలు పాటిస్తేనే నిర్విఘ్నంగా నిమజ్జనం

అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలకు దూరం


చెరువు వద్ద నిమజ్జనానికి గణనాథుడు

ఘట్‌కేసర్: వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఏ గల్లీలో విన్న ‘గణపతి బప్పా మోరియా’ నినాదాలు మార్మోగుతున్నాయి. నియోజకవర్గంలోని మండపాల్లో కొలువైన వినాయకుడి విగ్రహాలకు వీడ్కోలు పలికేందుకు నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఊరేగింపులో కొందరి అజాగ్రత్తల కారణంగా అపశ్రుతులు జరిగే ప్రమాదం ఉంది. ఇటీవల విగ్రహాల తరలింపు సమయంలో సుమారు 10 మంది వరకు మృత్యువాత పడ్డారు. ఈ క్రమంలో నిమజ్జనంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం..

మంచి వాహనం, మంచి డ్రైవర్...

నిమజ్జనం శోభాయాత్రకు కండిషన్ ఉన్న వాహనాలనే వినియోగించాలి. పూర్తయ్యేంత వరకు వాహన డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి. వేలాది మంది భక్తులు నిమజ్జనం చూసేందుకు వస్తుంటారు. అనుభవం ఉన్న వారిని ఎంపిక చేసుకోవాలి. వారు డ్రైవింగ్ పైనే దృష్టి సారించాలి. మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. డ్రైవర్ పక్కన, వాహనం ముందు భాగంలో ఎవరినీ కూర్చోనివ్వకూడదు. రోడ్డుపై ఉన్న గుంతల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

విద్యుత్ తీగలకు దూరంగా...

విద్యుత్ కేబుల్ కింద నుంచి వెళ్లే సమయంలో ప్రతిమలు తాకకుండా చూసుకోవాలి. లైటింగ్, విద్యుత్ కోసం నాణ్యమైన వైర్లనే వాడాలి. తెగిపోవడం, జాయింట్లు వేయడం చేయకూడదు. సెట్టింగ్‌ల వద్ద బాణాసంచా పేల్చకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తక్కువ ఎత్తులో వేలాడుతున్న కేబుళ్లను ముందే సరిచేసుకోవాలి. విద్యుత్ తీగలు తాకకుండా ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసుకోవాలి. వాహనాలు కేబుల్‌కు తాకకుండా కర్రలు సిద్ధం చేసుకోవాలి. మంటలు ఆర్పే సామగ్రిని ముందస్తుగా వాహనం వెంట ఉంచుకోవాలి.

చిన్నారులను వెంటే ఉంచుకోవాలి...

నిమజ్జనానికి చిన్నారులను ఒంటరిగా పంపొద్దు. చెరువులు, కుంటలు దగ్గరికి వెళ్లనీయకూడదు. శోభాయాత్రను చూసేవారు ప్రహరీ ఉన్న డాబాల పైకే ఎక్కాలి. విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలి.

చెరువు దగ్గర...

అధికారులు ఏర్పాటు చేసిన క్రేన్ల ద్వారానే నిమజ్జనం చేయాలి. అధికారులు, అక్కడి సిబ్బంది సూచనలను పాటించాలి. పోలీసులు, నిమజ్జనం సిబ్బంది హెచ్చరికలు కాదని చెరువు, కుంటల్లోకి దిగకూడదు. ఈత రాని వారిని చెరువుకు దూరంగా ఉంచాలి.

నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు

నిమజ్జనానికి ఏదులాబాద్ వినాయకసాగర్ (శ్రీలక్ష్మీనారాయణ చెరువు) వద్ద మున్సిపల్, పంచాయత్‌రాజ్, రెవెన్యూ, విద్యుత్, ఫైర్, పోలీస్‌శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తాగునీరు, భారీకేడ్లు, 23 సీసీ కెమెరాలు, రెండు పెద్దవి, ఒక చిన్న క్రేన్ ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేశారు. పోలీస్ ఉన్నతాధికారులు పలుమార్లు చెరువును సందర్శించారు. పారిశుద్ధ్యం కోసం వంద మంది కార్మికులు, 100 మంది పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు.

నిమజ్జనానికి సహకరించండి



నిమజ్జన సమయంలో అధికారుల సూచనలు పాటించాలి. భక్తి శ్రద్ధలతో నవరాత్రులు పూజించిన స్వామివారిని అంతే భక్తితో నిమజ్జనం చేయాలి. నిమజ్జనం ప్రశాంతంగా జరగడానికి అధికారులకు సహకరించాలి.

– రాజేష్, కమిషనర్ ఘట్‌కేసర్